

ముద్రగడను కలిసిన మాజీ మంత్రి అంబటి

ప్రజాశక్తి - కిర్లంపూడి రూరల్


మీడియాతో మాట్లాడుతున్న అంబటి

మాజీ మంత్రి, వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి అంబటి రాంబాబు బుధవారం కిర్లంపూడిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ ముద్రగడ లాంటి నాయకుడు రాజకీయాల్లో అరుదుగా ఉంటారని, కాపుల రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని నిర్మించారని అన్నారు. రాజకీయాల్లో నష్టపోయిన సరే ముద్రగడ తన కులాన్ని ఏనాడు ఉపయోగించుకోలేదన్నారు. చేసిన సవాల్‌ను స్వీకరించి ముద్రగడ తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారని అన్నారు.

నత్తనడకన ఖరీఫ్

- 30 శాతం దాటని నాట్లు పనులు
- అరకొరగానే సాగునీటి సరఫరా
- శివారు భూములకు అందని వైనం
- ప్రకృతి వైపరీత్యాలపై రైతుల్లో ఆందోళన



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జూన్ నెల 15 నుంచి 20 వ తేదీ వరకూ నారుమళ్ళు సిద్ధం చేసుకోవాలని, ఎదజల్లు సాగు చేసుకోవాలని, జులై 15 నుంచి 20 లోపు నాట్లు వేయడాన్ని పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ప్రణాళికలు వేసింది. కానీ ఆచరణలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది కూడా జూన్ 1 నుంచే కాలువలకు సాగునీటిని విడుదల చేసామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కాకినాడ జిల్లాలో ఖరీఫ్ పనులు నేటికీ నత్తనడకనే సాగుతున్నాయి. అరకొరగానే నాట్లు పడ్డాయి. ఇప్పటి వరకూ 70 నుంచి 80 శాతం మధ్య నాట్లు పూర్తి కావాల్సి ఉన్నా సాగు పనులు ప్రస్తుతానికి 30 శాతం కూడా దాటలేదు. సాగునీటి సరఫరాలో పర్యవేక్షణ లోపాలు, కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం వంటి పలు కారణాల నేపథ్యంలో ఎక్కువ ప్రాంతాలకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఖరీఫ్ ఊపందుకోలేదు.

వెంటాడుతున్న భయం

జిల్లా వ్యాప్తంగా సుమారు 3.10 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సాగు చేయనున్నారు. ఇందులో 2.26 లక్షల ఎకరాల్లో వరి, 587 ఎకరాల్లో మొక్కజొన్న, 2667 ఎకరాల్లో పప్పులు, 8 వేల ఎకరాల్లో పత్తి, 5,520 ఎకరాల్లో చెరకు సాగు జరగనుంది. వచ్చే ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబర్ నెలల్లో తుఫానులు, వరదలు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో రైతులకు పంట చేతికందే చివరి దశలో నష్టాలు జరిగే అవకాశం ఉంటుంది. ఈ తరుణంలో భారీ నష్టం తప్పేలా కనిపించడం లేదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రణాళిక ప్రకారం అక్టోబర్ 31 నాటికల్లా కోతల పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ అధికారులు అంచనా వేసిన లక్ష్యానికి సుదూరంగా వాస్తవ పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఇప్పటి వరకు..

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈనెల 15 నాటికి ఎదజల్లు సాగు పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సుమారు 50 వేల ఎకరాల్లో మాత్రమే ఈ పనులు ముగిశాయి. అలాగే మరో 50 వేల ఎకరాల్లో నాట్లు పనులు మరో రెండు మూడు రోజుల్లో పూర్తి అయ్యే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా సాగునీటి సమస్య వలన సాగు పనులు ముందుకు సాగడం లేదు. ఈ నెలాఖరులోగా పూర్తయితేనే ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు.

పూడిక పనులు సాగక

గోదావరి నుంచి గత నెల 1న కాలువల ద్వారా విడుదల చేసినా నేటికీ రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ కాలువల్లో పూడిక పేరుకుపోవడం ప్రధాన సమస్యగా మారింది. పూడిక పనులు కొత్త ప్రభుత్వం కూడా సక్రమంగా చేపట్టకపోవడంతో సాగునీటి సరఫరాకు తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. పుష్కలమైన సాగునీరు అందుబాటులో ఉన్నా గుర్రపు డెక్క, తూటి కాడ పేరుకుపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీనిపై గతంలో జరిగిన జడ్‌పి సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తినా అధికారులు పెడచెవిన పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శివారు ప్రాంతాలకు సాగు నీరు అందని పరిస్థితుల్లో బోర్లపైనే చాలా మంది రైతులు ఆధారపడుతున్నారు. కొన్ని ప్రాంతాలకు ప్రస్తుతం సక్రమంగానే సాగునీరు అందుతున్నా చాలా ప్రాంతాలకు చుక్కనీరు కూడా రావడం లేదు.

వంతుల వారీగా సాగునీరు

ఏలేరు సాగు నీటి వ్యవస్థ కింద ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలకు నీటి ఎద్దడి లేకుండా వంతుల వారీగా సాగునీటిని ఈనెల 9 నుంచి అధికారులు విడుదల చేస్తున్నారు. 9 నుంచి నవంబర్ 5 వరకు రానున్న 120 రోజుల పాటు పిఠాపురం, పెద్దాపురం, కిర్లంపూడి మండలాలకు వంతుల వారీ విధానంలో సాగునీరు విడుదల చేస్తున్నామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఇటీవల తెలిపారు. ప్రతి 10 రోజులు ఒక వంతు చొప్పున, తొలి 4 రోజుల పాటు పిఠాపురం మండలానికి, తదుపరి 3 రోజుల పాటు పెద్దాపురం మండలానికి, ఆపై 3 రోజుల పాటు కిర్లంపూడి మండలానికి రోజుకు 750 క్యూసెక్కుల చొప్పున ఏలేరు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. అయితే నేటికీ శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందని దుస్థితి నెలకొంది. దీనిపై అధికారులు పలుమార్లు పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను చక్కదిద్ది సక్రమంగా సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సకాలంలో సాగునీరు అందడం లేదు



పిఠాపురం మండలంలో ఇప్పటికే 60 నుంచి 70 శాతం వరి ఊడుపులు పూర్తి కావలసి ఉంది. మా గ్రామంలో కూడా నేటికీ 10 శాతం ఊడుపులు పూర్తి కాలేదు. ఏలేరు కాలువల ద్వారా ఇటీవలే సాగునీరు విడుదల అవుతుంది. మరో రెండు వారాలు తర్వాతే పూర్తిస్థాయిలో నాట్లు పడే అవకాశం ఉంది.

-ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి, రాపర్తి, పిఠాపురం మండలం.


గుల్ల మెట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తే చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - గండేపల్లి

అనుమతులు లేకుండా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షాన్ మోహన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని రామేశంపేట గుల్లమెట్ట ప్రాంతాన్ని ఆయన రెవెన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. గుండమెట్ట ప్రాంతంలో క్వారీలో ఎంతవరకు తవ్వకాలు జరిగాయి? అసైన్డ్, జిరాయితీ భూముల వివరాలు, గతంలో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు, అక్రమంగా తరలిస్తున్న మైనింగ్ వంటి వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గండేపల్లి, ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల్లో అనుమతులు ఉన్న క్వారీలతోపాటు అనుమతులు లేని క్వారీల్లో కూడా అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి సంబంధించి గత రెండు రోజులుగా కొన్ని వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇసుక కోసం పగడ్బందీగా ఎలా వ్యవహరిస్తున్నామో గ్రావెల్ తవ్వకాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గండేపల్లి మండలానికి సంబంధించి గుల్లమెట్ట ప్రాంతంలో 234 ఎకరాలకు గాను 216 ఎకరాలు అసైన్డ్ భూములు, మిగిలినది జిరాయితీ భూములుగా ఉన్నాయన్నారు. 2021-22 సంవత్సరం వరకు 3.45 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పనులకు మినహా ఇతర పనులకు గ్రావెల్ తవ్వకాలను తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేంతవరకు ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి వీలులేదని, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో గనుల శాఖ డిడి ఇ.నరసింహారెడ్డి, జిల్లా విజిలెన్స్ నిఘా విభాగాం అధికారి సురేష్‌రెడ్డి, గండేపల్లి, పెద్దాపురం తహశీల్దార్లు జె.చిరంజీవి, ఎస్.శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సవితమ్మను కలిసిన 'పిల్లి' దంపతులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితమ్మను మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బిసిలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారివెంట పెరికి సాధికార సమితి జిల్లా కన్వీనర్ కొమిరిశెట్టి నరసింగ రావు, టిడిపి నాయకులు కంటే సత్యనారాయణ, రెడ్డి రూపేష్‌కుమార్ ఉన్నారు.


మంత్రిని సత్కరిస్తున్న పిల్లి దంపతులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత: ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళల సమస్యలను తన దృష్టికి వస్తే వాటిని పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. బెట్టింగులు, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించారు. కాకినాడ జిల్లా ప్రజల నుంచి పోలీసులకు ఎటువంటి సలహాలు ఇచ్చిన వాటిలో మెండుగా ఉంటే స్వీకరిస్తామని చెప్పారు. కింది స్థాయి సిబ్బంది నిరంతరం ప్రజారక్షణ గురించి పని చేయాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని అరికట్టడానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎంవి.భాస్కరరావు, ఎఆర్ డిఎస్‌పి సత్యనారాయణ, ఎస్ఇబి ఎఎస్‌పి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ జూనియర్ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ


ఎస్‌ఎఫ్ఐ నాయకులపై దురుసుగా వ్యవహరిస్తున్న యాజమాన్యం ప్రతినిధి

ప్రభుత్వ నిబంధనలు పాటించని నారాయణ కాలేజ్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. బుధవారం మొహరం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన స్థానిక గోడారి గుంటలో గల నారాయణ కాలేజీలో మొహరం రోజున కూడా క్లాసులు నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ నిరసన వ్యక్తం చేసింది. క్లాసులను బాయ్ కట్ చేయాలని విద్యార్థులను ఇంటికి పంపిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై, కార్యకర్తలపై కళాశాల యాజమాన్యం ప్రతినిధులు దురుసుగా ప్రవర్తించారు. ఎస్ఎఫ్ఐ నాయకులపై దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలతోపాటు, విద్యా సంస్థలకు ప్రభుత్వం మొహరం సందర్భంగా సెలవు ప్రకటించిందన్నారు. అయితే నగరంలోని గుడారిగుంటలో ఉన్న నారాయణ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్లాసులు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో ఇదే కళాశాలలో సెలవు రోజుల్లో క్లాసులు నిర్వహిస్తున్నారని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు వినతిపత్రం ఇచ్చామని, అయినా పట్టించుకోకపోవడంతోనే ఆ కాలేజీ యాజమాన్య ఇష్టారాజ్యంగా తరగతులను నిర్వహిస్తుందని దుయ్యబటారు. నారాయణ జూనియర్ కళాశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికంత, కాకినాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు సంజాయి, వాసుదేవ్, నాయకులుజైరాం, అభిషేక్, ఆదర్శ కార్తిక్, వంశీ, విశాల్, విపిన్ కుమార్ పాల్గొన్నారు.

సిద్ధాంత గ్రంథం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సాహితీ స్రవంతి కాకినాడ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు రచించిన 'తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు - తుల నాత్మక పరిశీలన' పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం స్థానిక వెలమ కమ్యూనిటీ హాలులో పోస్టర్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు సుందరరావు పుస్తక సమీక్ష చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చర్ల రామారావు, బొడ్డు ఉదయ్‌కుమార్, అరుణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ జి. ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ 33/11 కెవి ఆర్యవటం సబ్‌స్టేషన్‌లో 11కెవి ఇండస్ట్రియల్ పరిధిలో గల ఆర్యవటం, గొల్ల పాలెం, బందనపూడి, మొగలిపాలెం, కొంగోడు ఏరియాలో గల అన్ని పరిశ్రమలు, ఆక్వా ఏరియాలు, 33/11 కెవి కాజులూరు సబ్‌స్టేషన్‌లో గల 11 కెవి ఇండస్ట్రీయల్ ఫీడర్స్ పరిధిలోని గ్రామాలైన కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, శీల మేకల గరువు, పల్లిపాలెంలో గల ఆక్వా మరియు ఇండస్ట్రీయల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

విజయసాయి రెడ్డి వ్యాఖ్యలపై జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - కాకినాడ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి జర్నలిస్టులను అసభ్య పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద పలువురు జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇచ్చేందుకు ప్రెస్‌మీట్ పెట్టిన విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై అభ్యంతకరమైన రీతిలో వ్యాఖ్యలు చేశారని అన్నారు. అసభ్య పదజాలంతో దూషించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే మీడియా యాజమాన్యానికి, ప్రతినిధులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు స్వాతి ప్రసాద్, నవీన్ రాజ్, కృష్ణంరాజు, రాజేష్ వర్మ, పాల్గొన్నారు.

నేటి నుంచి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై రాష్ట్రంలోని 11 జిల్లాలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు ఈనెల 18 నుంచి 27 వరకూ మూడు బ్యాచ్‌లుగా శిక్షణలు ఇవ్వనున్నట్లు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ థీమ్ 1, 3, 4 అంశాలపై మూడేసి రోజులు చొప్పున శిక్షణ ఇస్తారని తెలపారు. ఈ శిక్షణకు జడ్‌పి సిఇఒలు, ఐసిడిఎస్ అధికారులు, విద్యాశాఖ, పంచాయితీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ డబ్ల్యుఎస్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, డ్వామా శాఖలకు చెందిన జిల్లాస్తాయి అధికారులు 11 జిల్లాల నుంచి విచ్చేసి శిక్షణ పొందనున్నట్లు చెప్పారు.

అపరిశుభ్రత ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


అపరిశుభ్రత ఆరోగ్యాలకు హానికరమని పిఎంపి వైద్యులు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్వగృహంతోపాటు పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని, బహిరంగ ప్రాంతాల్లో మాల విసర్జన చేయరాదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి బయటపడవచ్చునని అన్నారు. అనంతరం బిపి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, రాజా పాల్గొన్నారు.

చంద్రన్న బీమాతో ప్రజలకు భరోసా

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చంద్రన్న బీమాతో బాధితులకు ధీమాను కల్పిస్తామని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. మండలానికి చెందిన కోరంగి పంచాయతీ సీతా రామపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బొక్కా వెంకటేశ్వరరావు(45) గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం ఎంఎల్ఎ బాధిత కుటుంబాన్ని పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో బీమా సౌకర్యం ఉందో లేదో తెలియని స్థితిలో ఉందన్నారు. తమ ప్రభుత్వ పాలనలో చంద్రన్న బీమాను అమలులోకి తెచ్చి ప్రతీ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ పర్యటనలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, అత్తిలి బాబూ రావు, నిమ్మకాయల సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రసాయన సమీకరణాలపై ప్రయోగాలు

ప్రజాశక్తి - పెద్దాపురం


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

భౌతిక శాస్త్రంలో రసాయన సమీకరణాలపై విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. బుధవారం స్థానిక రామారావు పేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దాపురం, సామర్లకోట మండలాల పరిధిలోని ప్రతిభ విద్యానికేతన్, కట్టమూరు జడ్‌పి హైస్కూల్, సాగర్ మున్సిపల్ హైస్కూల్, జెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్, చాచా విద్యానికేతన్, కెఎస్ఎన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, లూథరన్ హైస్కూల్స్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా పిఎస్ టీచర్స్ ఫోరం అధ్యక్షులు మూర్తి భౌతిక శాస్త్రంలో మెలకువలను వివరించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్‌కు మ్యాజిక్ స్టార్ అవార్డు వచ్చిన సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్య దర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, ప్రజానాట్యమండలి కళా కారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు అనంతరావు, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి దేవత రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో ఎల్ఇడి కాంతులు

ప్రజాశక్తి - కాకినాడ


స్విచ్ ఆన్ చేస్తున్న డిఎంఇ నరసింహం

కాకినాడ జిజిహెచ్‌లో బుధవారం ఎపి వైద్య సంచాలకులు(డిఎంఇ) డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం క్యాన్సర్ శస్త్ర చికిత్స విభాగంలో ఆపరేషన్ థియేటర్ రూఫ్ టాప్ లైట్స్‌ను ప్రారంభించారు. సుమారు రూ.1.80 లక్షల విలువ గల ఈ అధునాతన ఎల్ఇడి దీపాలను అమెరికా, సాన్ జోస్ వాస్తవ్యులైన జొన్నలగడ్డ రవిశంకర్, గౌరీలక్ష్మి విరాళంగా, ఇందిర, చాగంటి సూర్యనా రాయణ పేరు మీద ఇచ్చి, తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా డిఎంఇ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెల నుంచి క్యాన్సర్ శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక విభాగాన్ని కాకినాడ ఆసుపత్రిలో ప్రారంభించినట్లు తెలిపారు. కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులకు అత్యున్నత శస్త్ర చికిత్స సేవలు అందించడంలో ఈ విభాగం కృషి చేస్తోందని చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ నివారణ, నిర్ధారణ, చికిత్సకై 'సమగ్ర క్యాన్సర్ చికిత్సా విధానం' అందుబాటులో ఉందన్నారు. ఈ కార్య క్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, జనరల్ సర్జన్ హెడ్ డాక్టర్ రవికమల్ కుమార్, అనస్తీషియా హెడ్ డాక్టర్ విష్ణువర్ధన్, పిల్లల విభాగ హెడ్ డాక్టర్ మాణిక్యాంబ, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ అనిత, డాక్టర్ శైలజ, శైలజారాణి, సత్యవాణి క్యాన్సర్ శాస్త్ర చికిత్స నిపుణులు సమంతకుమార్, ఆపరేషన్ థియేటర్ నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఎంట్రన్స్‌పై అవగాహన సదస్సు.

ప్రజాశక్తి - కరప

మండలంలోని అరట్లకట్ట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నవోదయ, సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఎంఇఒలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయా ప్రవేశ పరీక్షలలో వచ్చు అంశాలు, పరీక్షా విధానం, ప్రిపరేషన్ విధానం మొదలగు అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నవోదయ, సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌కు అరట్లకట్ట ప్రాథమిక పాఠ శాలలో గల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. రీజనింగ్ ఫ్యాకల్టీ ఎస్. ధనరాజ్, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ .ఎవిఆర్. నరేష్‌బాబు, జికె ఫ్యాకల్టీ వి.గోపాలకృష్ణ, మ్యాథ్స్ ఫ్యాకల్టీ జి.నాగేశ్వరరావు, పి.విజయ్, బయాలజీ ఫ్యాకల్టీ పి.కిషోర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మీకోసం' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమాజానికి ప్రయోజనకరమైన పనులు చేయాలనే సంకల్పంతో దినసరి వేతనం సంపాదించే యువకులు మీకోసం స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవలు అందించడం అభినందనీయమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. బుధవారం అడబాల ట్రస్ట్ కార్యాలయంలో మీకోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మబద్ధంగా సంపాదిస్తూ సేవలందిస్తున్న యువకులను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్, సంస్థ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, అడబాల రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దోచుకున్న వారిని వదిలేదు లేదు

ప్రజాశక్తి - కోటనందూరు

గత వైసిపి పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని, సహజవనరులను దోచుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మండలి ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం తేటగుంటలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో కోటనందూరు, తుని పట్టణ, రూరల్ మండలాలకు చెందిన ముఖ్య నేతలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎంఎల్‌ఎ యనమల దివ్య అధ్యక్షతన జరిగిన సమావేశ:లో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై దష్టి సారించామని అన్నారు. సహజ వనరులను, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. ఎంఎల్‌ఎ యనమల దివ్య మాట్లాడుతూ మూడు మండలాల్లో ఉన్న ప్రధాన సమస్యలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వాటి ప్రాధాన్యతను బట్టి దశలవారీగా ఆ పనులు నిర్మాణం చేపడతామని అన్నారు. ఐక్యతతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, బాబు, అంకమరెడ్డి బుల్లిబాబు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు, చిత్రంలో ఎంఎల్‌ఎ దివ్య



పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభిస్తున్న డిఎస్‌పి లతాకుమారి

మహిళల రక్షణే ధ్యేయం : డిఎస్‌పి

ప్రజాశక్తి - జగ్గంపేట

మహిళలకు రక్షణే ధ్యేంగా పోలీసు శాఖ పని చేస్తుందని డిఎస్‌పి లతాకుమారి అన్నారు. బుధవారం మండలంలోని కాట్రావులపల్లిలో పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక కేసులు కాట్రావులపల్లి గ్రామం నుంచి నమోదు అవుతున్నాయని అన్నారు. అందుకే ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీస్ అవుట్ పోస్ట్‌ను గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈజ్ టీచింగ్, మహిళలకు ఎటువంటి హానీ జరగకుండా ఉండేందుకు పోలీస్ అవుట్ పోస్ట్ ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ అవుట్ పోస్ట్‌లో జగ్గంపేట పోలీస్‌స్టేషన్ నుంచి ప్రతిరోజు ఎఎస్‌ఐ, హెచ్‌సి, మరో ఇద్దరు స్టాఫ్ అందుబాటులో ఉంటారని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎత్తివేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ లక్ష్మణరావు, ఎస్‌ఐ రామకృష్ణ, ఎఎస్‌ఐ నూకరాజు, పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ సుగుణ రావు, సుంకర సీతారామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



మునిస్వామిని సత్కరిస్తున్న నూతన కార్యవర్గం ప్రతినిధులు

డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా యానాం ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఏలూరు శివప్రసాద్‌రావు, వైస్ ప్రెసిడెంట్‌గా శేరు కమల శ్రీనివాసరావు, సెక్రటరీగా కట్టా ఆనంద్, ట్రెజరర్‌గా అత్తిలి గోవిందరాజు, జాయింట్ సెక్రటరీగా బల్లిపాటి ముసలయ్య, సలహాదారుగా బొడ్డు నాగ సూర్యప్రసాద్, కమిటీ సభ్యులుగా శేరు వెంకటేశ్వరరావు, ఎనమదల రాంబాబు, సెమ్మ వీరవెంకటసత్యనారాయణ, చేటకాల సుబ్బారావు, బేతళం సత్యనారాయణ, మట్టపర్తి దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గం ఆర్ఎఒ మునిస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

మత్స్యకారుల ఖాతాల్లో జీవన భృతి జమ

ప్రజాశక్తి - యానాం

చేపల వేట నిషేధం నేపథ్యంలో యానాంలోని 4,705 మంది మత్స్యకారులకు రూ.6,500 చొప్పున పుదుచ్చేరి ప్రభుత్వం జీవనభృతిని వారి ఖాతాల్లో జమ చేసినట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు డి గొంతియ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరికైనా ఈ సహాయం పొందని వారు ఉంటే ఈ నెల 22వ తేదీలోగా యానాం మత్స్యశాఖకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణ రుణాల నిధుల మంజూరు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు ద్వారా యానాంలో గృహ నిర్మాణం చేపట్టిన ఆయా లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసినట్లు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు విడతలకు సంబంధించి మొత్తం 61 మంది లబ్ధిదారులకు రూ. 88.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో రెండో విడతలో 50 మంది లబ్ధిదారులకు రూ.80 లక్షలు, మూడో విడతలో 11 మంది లబ్ధిదారులకు రూ.8.20 లక్షలు మంజూరు కాగా ఆయా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.

డ్రెయినేజీల ఆక్రమణలను తొలగించాలి: కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో తక్షణమే డ్రెయినేజీల ఆక్రమణలను తొలగించాలని నగర కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. బుధవారం ఆయన మిలిటరీ రోడ్డులోని చీడిలపోర డ్రెయిన్, డి-మార్ట్ ప్రాంతంలోని డ్రెయినేజీల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. చీడిలపోర వద్ద ప్రధాన డ్రెయినేజీలో గుర్రపు డెక్క పేరుకు పోవడాన్ని గుర్తించి రెండు మూడు రోజుల్లో తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డి-మార్ట్ ప్రాంతంలో కొంతమంది డ్రెయినేజీలపై సిమెంట్ స్లాబ్ లు వేయడంపై ఆయన మండిపడ్డారు. డ్రెయినేజీలపై వేసిన సిమెంట్ స్లాబ్‌లను ఒకటి రెండు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థ తరపున తొలగించి అందుకు అయ్యే ఛార్జీలు వసూలు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. సర్పవరం జంక్షన్‌లోని నమ్మ టాయ్‌లెట్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో డిసిపి హరిదాస్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయి పరిశీలనలో ఆదేశాలు ఇస్తున్న కమిషనర్

క్రియాశీలక సభ్యత్వాల నమోదుకు కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి జనసేన కార్యకర్త క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయించేందుకు కృషి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి జనసేన కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమర శెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గణేష్, కటారి శ్రీను, మంచం సాయిబాబు, మడగల శ్యాం కుమార్, కొప్పిరెడ్డి నాగబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రామస్వామి

విజయసాయి రెడ్డిపై జర్నలిస్టుల ఫిర్యాదు

ప్రజాశక్తి -గోకవరం

జర్నలిస్టులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై బుధవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ బుధవారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ ఫోర్త్ స్టేట్‌గా పిలవబడే జర్నలిస్టులను దుర్భాషలాడిన విజయసాయి రెడ్డిపై తక్షణమే కేసు నమోదు చేయాలన్నారు. అధికారులు, నాయకులు జర్నలిస్టులపై భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు పునరావత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రజకుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

రజకుల అభివద్ధి కోసం అనేక జిఒలు ఉన్నా ప్రభుత్వాలు వాటిని కింది స్థాయిలో అమలు చేయడం లేదని ఉమ్మడి గోదావరి జిల్లా రజక సంఘం నాయకులు చిలకల కట్లయ్య అన్నారు. ఆయన బుధవారం మండలంలోని తాళ్లపూడిలో రజకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ రజకుల కోసం చెరువులు తవ్వించడంతోపాటు ధోబీఖానాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్నిచోట్ల ఈ పనులు కానరావడం లేదన్నారు. గ్రామాల్లో రజకులను చిన్నచూపు చూస్తున్నారంటూ తమ న్యాయమైన కోరికలను రజకులు అందుకోలేకపోతున్నారన్నారు. రజకుల సంక్షేమం కోసం జిఒ నెంబర్ 62 ప్రకారం ప్రతి ఆరు నెలలకు జిల్లా స్థాయిలో నిర్వహించాలంటూ వీరి ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గోపాలపురం ఎంఎల్‌ఎగా ఉన్న సమయంలో రజకులకు భవనాలు కట్టించి ఇచ్చారని, అందరు ఎంఎల్‌ఎలు వారి నియోజకవర్గాల్లో రజకుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలపై ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి-తాళ్లపూడి, చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రతతో పాటు టెండర్ విధానం రద్దు వంటి పలు సమస్యలపై గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందిస్తూ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.

రాధాకృష్ణులకు వెండి కిరీటాలు

ప్రజాశక్తి-కడియం

కడియం మేకల దిబ్బ ప్రాంతంలోని ఆలయంలో రాధా కృష్ణులకు సూరపురెడ్డి పెదకాపు కుమారుడు వీర్రాజు, విజయలక్ష్మి దంపతులు బుధవారం వెండి కిరీటాలు బహూకరించారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు రూ.60 వేల విలువైన కిరీటాలను అందించి పూజలు నిర్వహించారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నారాయణపురంలోని శ్రీగౌతమీ జీవ కారుణ్య వద్ధుల ఆశ్రమాన్ని కలెక్టర్ ప్రశాంతి బుధవారం సందర్శించారు. అక్కడ వృద్ధులతో మాట్లాడారు. ఆశ్రమం ఆవరణలో జామ మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వృద్ధులకు చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి బాగోగులు చూడాలని నిర్వాహకులకు సూచించారు. నిరాదరణకు గురుదైన వృద్ధుల పట్ల, అనాథ పిల్లల పట్ల మానవత్వంతో వ్యవహరించాల్సి ఉందన్నారు. వారికి మనం ఉన్నామనే భరోసా కల్పించి, మన వంతుగా చేయూతను అందించాలని తెలిపారు. ఆశ్రమ నిర్వహణ పట్ల మరింత జాగ్రత్త వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వద్ధాశ్రమంలో 66 మంది వృద్ధులతోపాటు 22 మంది అనాథ పిల్లలకు ఆశ్రయం ఇస్తున్నట్లు నిర్వాహకులు ఇఒ వి.పల్లంరాజు వివరించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధుల కోసం పిల్లల కోసం దాతలు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం, అన్నదానం చేయడం వంటి కార్యక్రమాలు స్వచ్ఛందంగా పాల్గొనడం జరుగుతుందని వివరించారు. వృద్ధులకు ఉదయం అల్పాహారం కోసం రూ.2 వేలు, ఒక పూట భోజనం కోసం రూ.4,500, అనాథ పిల్లల అల్పాహారం కోసం రూ.వెయ్యి, ఒక పూట భోజనం కోసం రూ.2,500 ఇస్తే వారి పేరున ఏర్పాట్లు చేస్తారని తెలిపారు.

ఎంఎల్‌ఎ వల్లే హాస్టల్స్‌లో సదుపాయాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎగా ఎన్నికైన ఆదిరెడ్డి శ్రీనివాస్ వల్లే నెలరోజులు తిరగకముందే బిసి సంక్షేమ వసతిగృహాల్లో సదుపాయాలు కల్పించారని టిడిపి నాయకులు అన్నారు. వై.జంక్షన్‌లోని బిసి బాలుర వసతి గృహాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, బిసి సాధికార సమితి శెట్టిబలిజ విభాగం కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా మీడియాతో మాట్లాడారు. గత వైసిపి పాలనలో మాజీ ఎంపీ మార్గాని భరత్, మంత్రి చెల్లుబోయిన వేణు బిసి సామాజిక వర్గానికి చెందిన వారైనా కనీస సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. భరత్ తనకు ఆదాయం వచ్చే వాటిపైనే దృష్టి పెట్టి, పైపై మెరుగులకే ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు బిసి బాలుర వసతిగృహంలో 22 బాత్‌రూమ్‌లకు మరమ్మతులు చేయించారన్నారు. అలాగే గణేష్ చౌక్ వద్ద ఉన్న బిసి బాలికల వసతిగృహంలో 18 నుంచి 20 బాత్ రూమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఇలాంటి చిన్న పనులు కూడా గత వైసిపి బిసి ప్రజాప్రతినిధులు చేయలేక పోయారని విమర్శించారు. టిడిపి పాలనలోనే బిసిలకు న్యాయం జరుగుతుందనే దానికి ఈ వసతిగృహాలే నిదర్శనమన్నారు. వారి వెంట టిడిపి నగర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవి యాదవ్, కార్యదర్శి కిలపర్తి శ్రీను, నాయకులు కొల్లి బుజ్జి, రుంకాని విజయ్, కడియాల వీరభద్రరావు, చింతపల్లి నాని, శ్యామ్ కడియాల శ్రీనివాస్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బర్రే ఆనంద్‌కుమార్

గత కలెక్టర్ మాధవీలతపై ఫిర్యాదు చేస్తాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గత కలెక్టర్ కె.మాధవీలత అవినీతి, అక్రమాలపై నూతన ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్టు స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్)"ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బర్రే ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కలెక్టర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, మేజిస్ట్రేట్‌గా కాకుండా వైసిపి కార్యకర్తగా వ్యవహరించారన్నారు. అవినీతి, అక్రమాలకు తోడుగా నిలుస్తూ కొండలు, మెట్టలు, చెరువుల్లో మట్టి, ఇసుక వంటి సహజ సంపదను దోచి పెట్టడమే కాకుండా ప్రభుత్వ భూములను చాలావరకు అన్యాక్రాంతం చేశారన్నారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు చేస్తే నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. ఈ మేరకు జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలత అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. రాజానగరం మండలం, శ్రీకష్ణపట్నంలో సుమారు 80 ఎకరాల సీలింగ్ భూమి నిరుపేదలకు చెందాల్సిందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఆ సర్వే నంబర్లను బ్లాక్‌లో పెట్టడం తప్ప అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే ఆ భూమిని పేదలకు పంచాలని 2022 జూన్ 6న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ భూమిని గత కలెక్టర్ వారం రోజులకే ప్రయివేటు వ్యక్తికి ధారాదత్తం చేసే విధంగా మొత్తం సర్వే నెంబర్లను బ్లాక్‌లో నుంచి తీయించేశారని తెలిపారు. ఈ విషయమై విజయవాడలో సిసిఎల్‌ఎకి వెళ్లి స్పెషల్ ఛీఫ్ సెక్రటరీకి స్వయంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఐటి సెల్ విభాగంలో వాటి వివరాలను పరిశీలించాల్సిందిగా, అసిస్టెంట్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారన్నారు. రెండు గంటల పాటు ఆ భూముల వివరాలను పరిశీలించినప్పటికీ, వాటి వివరాలు కనబడకుండా తీసేశారన్నారు. దీనిపై విచారణ చేస్తామని అధికారులు చెప్పారన్నారు. కాని ఆ తర్వాత రోజునే జక్కంపూడి రాజా రెవెన్యూ మంత్రి, సిసిఎల్‌ఎ అధికారులను కలిసినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. దీంతో విచారణ ఆగిపోయిందన్నారు. మూడు సార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆ సీలింగ్ భూములను ప్రయివేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని మునగాల కొండ, రఘుదేవపురం కొండ, నాగంపల్లి కొండ, నల్గొండ కొండ, రామచంద్రాపురం కొండ, కాటవరం కొండ, కోటి కేశవరం కొండ, ముగ్గళ్ల నుంచి కూనవరం వెళ్లే దారిలో మెట్ట, జి.యర్రంపాలెం వద్ద ఉన్న కొండ ఇలా దాదాపుగా తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నా ఏ కొండను, మెట్టను వదిలిపెట్టలేదన్నారు. ప్రకృతి సంపదను మొత్తం వైసిపి నాయకులతో కలిసి దోచేశారన్నారు. ఎలాంటి అనుమతులు ఇవ్వలేని ఆర్‌టిఐ ద్వారా మైన్స్ శాఖ తెలిపిందన్నారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ మాధవిలతకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా 30 నుంచి 60 అడుగుల లోతులో చెరువుల్లో తవ్వకాలు చేశారన్నారు. మునగాల ఎస్‌సి పేటలో సోషల్ వెల్ఫేర్ భూమిని సైతం వైసిపి నాయకులకు అన్యాక్రాంతం చేసేలా సహకరించారన్నారు. అన్ని గ్రామాల్లోనూ రికార్డులను తారుమారు చేసి విచ్చలవిడిగా భూ దందా చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఐఎఎస్ స్థాయి అధికారులు కూడా ఇంత నిస్సిగ్గుగా, చట్టాలకు భయపడకుండా వ్యవహరించడంపై జిల్లా ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నూతన ప్రభుత్వం సమగ్ర విచారణ చేయడానికి కమిటీ వేస్తే అన్ని ఆధారాలు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో వి.శ్రీను, విజ్జిన వీర్రాజు, కొత్తపల్లి మహేష్, విజ్జిన రాంబాబు, దేగపాటి ప్రశాంత్ కుమార్, వేమవరపు రాజు, కాకి హనుమంతు, వందే లక్ష్మణరావు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా పార్కును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వలసపాలక పార్కును పర్యావరణహితంగా అభివృద్ధి చేయాలని వార్డు మాజీ మెంబర్ మేడిశెట్టి వెంకటరమణ కోరారు. బుధవారం స్థానిక వలసపాకల పార్కులో వాకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్క్ స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసపాకల పార్కు అభివృద్ధికి పంచాయతీ రూ.40 లక్షలు ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటనలు వస్తున్నాయని, కానీ ఆ ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదన్నారు. అసౌకర్యాలతో పార్కు ఉండటంతో వాకర్లు రాక, అవి అసాంఘిక కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కు పరిస్థితిపై అధికార యంత్రాంగానికి ఎని దఫాలు వివరించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటికైనా అధికార యంత్రాంగం పార్కు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే పార్టీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జగన్నాథం, సత్యనారాయణ, శ్రీనివాస్, వీరబాబు, వీరభద్రం, సతీష్, గంగరాజు పాల్గొన్నారు.



చేసిన తీర్మాణం ప్రతిని చూపుతున్న పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

అర్బన్ గ్రామాలకు విముక్తి కలిగించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నగరంలో విలీనం అయ్యే 8 గ్రామాలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కోరింది. బుధవారం వాకలపూడి యాదవ కళ్యాణ మండపంలో మాజీ సర్పంచ్ గింజాల శ్రీనివాసరావు అధ్యక్షతన పౌర సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ అర్బన్‌లో 8 గ్రామాలను కలపాలనే డిమాండ్‌తో రాజకీయాలకు అతీతంగా 8 గ్రామాల ప్రజలు అభిప్రాయాల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు ఈ సందర్భంగా ఆయా గ్రామాల అభిప్రాయాలను ప్రభుత్వ పెద్దలను కలిసి వివరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించింది. సమావేశంలో మండా సింహాద్రిరాజు, ఎం.సత్యనారాయణ, వీరగని వేంకటేశ్వరరావు, సిహెచ్ నల్లబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు నిర్భయంగా తెలియజేయండి'

ప్రజాశక్తి - పెద్దాపురం

బాలలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె స్థానిక నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాల, బాలికలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ సభ్యులు వివిధ పాఠశాలల సందర్శించి బాలల హక్కులపై వారికి అవగాహన కల్పిస్తున్నారన్నారు. సమస్యలు ఉన్నప్పుడు బాలలు ఆ సమస్యలను ఏ విధంగా, ఎవరికి తెలియజేయాలో బాలలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. సమస్యలను తెలియచేసినప్పుడే ఆ సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని గుర్తించాలని వివరించారు. ఈ పర్యటనలో నవోదయ వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, ఎంఇఒ ప్రభాకర్ శర్మ, స్కూల్ అసిస్టెంట్ రామలక్ష్మి, నవోదయ ఉపాధ్యాయులు జగన్మోహన్‌రావు, ఆర్.సత్యనారాయణ, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ సనపల సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి

యాత్రికులతో ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - సామర్లకోట

తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. విష్ణు, పాండురంగ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి రోజున కొత్తగా పెళ్ళైన జంటలను మరోమారు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురుగా అలంకరించి ప్రత్యేక పూజాలతో, పిండి వంటలతో కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ, తిరిగి సాయంత్రం నుంచి రాత్రి వరకూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్‌పై కూలిన చెట్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌టిఒ కార్యాలయ సమీపంలో బుధవారం ఒక చెట్టు కూలి మోటార్ బైక్‌పై పడటంతో బైక్ నడుపుతున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానిక మేదర వీధికి చెందిన సురేష్ మోటార్ బైక్‌పై తన స్నేహితుడిని బ్యాంకు కాలనీలో దించి తిరిగి వెడుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మోటార్ బైక్ ధ్వంసం కాగా సురేష్ స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడి పందేలపై దాడి

8 మంది అరెస్టు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని వేల్ల చింతలగూడెంలో కోడిపందేల స్థావరంపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో 8 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రూ.12,170 నగదు, రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, 14 బైకులు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు.